

వేడుకగా కృష్ణాష్టమి **6**

- గోపిక, కృష్ణుల వేషధారణల్లో చిన్నారులు
- ఉట్టికొట్టేందుకు యువత పోటీ



ఎలా ముందుకెళ్లాలి?

- జిందాల్ భూములపై ఫిర్యాదుల వెల్లువ
- పరిష్కారంపై మల్లగుల్లాలు పడుతున్న అధికారులు
- ఎప్పటికప్పుడు నివేదికలకు ఆదేశం
- పదిహేనేళ్ల క్రితం జిందాల్‌కు అప్పగించిన భూములు
- పరిశ్రమల స్థాపన లేక నేడు వివాదం





కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందిస్తున్న ఎస్.కోట మండలం కిల్తంపాలెం గ్రామ పరిధిలోని దెప్పూరు గిరిజనులు (ఫైల్)

శృంగవరపుకోట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి)

జిందాల్ భూముల వ్యవహారానికి సంబంధించి కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు నెలల కాలంలో ఒకట్రెండు రోజులు తప్ప ప్రతి సోమవారం ఏదో ఒక సమస్యతో జిందాల్ భూ నిర్వాసితులు కలెక్టరేట్‌కు వస్తున్నారు. మరో పక్క స్థానిక రెవెన్యూ కార్యాలయంలోనూ ఆ భూముల సమస్యలపై ఫిర్యాదులు అందుతున్నాయి. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు, జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు కూడా వెళ్తున్నారు. దీంతో రెవెన్యూ శాఖపై రోజురోజుకూ పని భారం పెరుగుతోంది. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు ఇప్పుడు ఆ భూముల వ్యవహారంపై దృష్టిసారించాల్సి వస్తోంది.

గ్రీవెన్స్ (ప్రస్తుత పీజీఆర్ఎస్)లో వచ్చిన ప్రతి సమస్యకూ అధికారులు పరిష్కారం చూపాలి. భూ సమస్యలు కావడంతో గ్రీవెన్స్‌కు వెళ్లిన ప్రతి సమస్యపైనా ఆయా రెవెన్యూ గ్రామాల రికార్డుల ప్రకారం క్షేత్ర స్థాయిలో భూమి స్థితిని పరిశీలించాలి. ఇందుకు గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఉప తహసీల్దార్, మండల సర్వేయర్‌లు సుదీర్ఘ కసరత్తు చేయాల్సి వస్తోంది. అనంతరం తహసీల్దార్ అక్కడ నుంచి ఆర్డీవో, జేసీ, కలెక్టర్ వరకు నివేదికల తయారీ పనిపడు తోంది. ఎప్పుడో జరిగిన భూ సేకరణకు ఇప్పుడు రెవెన్యూ అధికారులు సమాధానం చెప్పుకోవాల్సి రావడం ఈ శాఖకు ఇబ్బందిగా మారింది. ఎస్.కోట మండల పరిధిలోని మిగిలిన రెవెన్యూ సమస్యలను ఒక్కోసారి పక్కన పెట్టాల్సి వస్తోంది. మానవ వనరులతో పాటు ఆర్థిక వనరులను దీని కోసం ఖర్చు చేయాల్సి రావడంతో రెవెన్యూ శాఖకు తలకుమించిన భారంగా మారింది.

2007లో భూముల అప్పగింత..

జెఎస్‌డబ్ల్యూ అల్యూమినియం లిమిటెడ్ (జిందాల్)కు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో శృంగవరపుకోట మండలం కిల్తంపాలెం, మూలబొడ్డవర, చినఖండేపల్లి, చీడిపాలెం, ముషిడిపల్లి గ్రామాల్లో భూములు సేకరించారు. దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2007 జూన్ 28న ఆ యాజమాన్యానికి 834.66 ఎకరాల అసైన్డ్ భూములు, 151.04 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. వీటితో పాటు జిందాల్ యాజమాన్యం 180.73 ఎకరాల జిరాయితీ భూమిని రైతుల నుంచి తీసుకుంది. మొత్తం 1166.43 ఎకరాలను ఈ పరిశ్రమ యాజమాన్యం పొందింది. 382 రైతు కుటుంబాలు నిర్వాసితులుగా మారారు. ఇందులో అత్యధిక శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులు. వీరు పూర్తిగా జీవనాధారం కోల్పోయారు.

హామీలు అమలు చేయక..

ప్రభుత్వం నుంచి తీసుకున్న భూమిలో ఇంతవరకు ఎటువంటి పరిశ్రమను నిర్మించలేదు. భూములన్నింటినీ ఖాళీగా ఉంచారు. భూములను తీసుకున్న (మిగతా 8వ పేజీలో..)

పోలీసులకు ఊరటెప్పుడో?

- అమలు కాని సరెండర్ లీవులు
- బకాయిల్లోనే టీఏ, డీఏలు
- వారాంతపు సెలవు హామీ అమలుపై మౌనం
- ఉమ్మడి జిల్లాలో దాదాపు 2,200 మందికి పైగా పోలీసులు



విజయనగరం క్రైం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఖాకీ డ్రెస్ వేసుకుని లాఠీ పట్టుకుని పైకి పోలీసులు గాంభీరంగా కనిపిస్తారు కానీ మనసంతా ఆవేదనే. వారి జీవితాల్లో అశాంతి, అభద్రతే. ఒకసారి విధుల్లో చేరాక ప్రతి నిమిషం అదే ఆలోచన. ఎక్కడ ఏమైపోతుందోనన్న టెన్షన్... ఏదైనా జరిగితే, ఉన్నతాధికారులు ఏమంటారోనని ఆందోళన. కుటుంబంతో గడపలేరు. అలాగని జీవనాధారమైన ఉద్యోగాన్ని వదల్లేరు. పండుగైనా, పబ్బమైనా నిత్యం శాంతిభద్రతలే లక్ష్యంగా పనిచేస్తూ ఒత్తిడికి గురవుతున్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించాలంటే శాంతిభద్రతలు బాగుండాలి. వాటిని పరిరక్షించే పోలీసుల వ్యక్తిగత జీవితాలు మాత్రం దయనీయం. పోలీసు సిబ్బంది పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం మాత్రం ఇప్పటికీ కొనసాగుతోంది. వారికి ఇవ్వాల్సిన అడిషనల్ సరెండర్ లీవ్, సరెండర్ లీవ్స్, టీఏ, డీఏ బకాయిలు సైతం ఇవ్వకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నారు. ఈ డబ్బులు మూడు విడతలుగా జనవరి, జూలై, నవంబరు నెలల్లో జమ చేయాల్సి ఉంది. కానీ ఏడాదిన్నరగా (మిగతా 8వ పేజీలో..)

రైతుల కోసమని ఇచ్చి మూలకు చేర్చి

వైసీపీ ప్రభుత్వంలో వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించిన దండగమారి పథకాల్లో అప్పటి రైతుభరోసా కేంద్రాల్లో ఏర్పాట్లు చేసిన కియోస్క్ యంత్రాలు కూడా ఒకటిగా చెప్పుకోవచ్చు. జిల్లాకు సంబంధించి ఈ యంత్రాల పేరుతో దుర్వినియోగమైన నిధులు అక్షరాలా రూ.3కోట్ల 48లక్షల 40వేలు. ఈ యంత్రాలు ఏర్పాటుచేసిన మరుక్షణం నుంచే నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో లక్ష్యం అటకెక్కి ఆయా కేంద్రాల్లో దిష్టిబొమ్మల్లా మిగిలాయి. వీటివల్ల రైతులకు ఒనగూరిన ప్రయోజనం ఇసుమంతైనా లేకపోవడంతో నిధుల వృథాకు నిలువెత్తు సాక్ష్యంగా వెక్కిరిస్తున్నాయి.



మెంటాడలో నిరుపయోగంగా కియోస్క్ యంత్రం

- నిరుపయోగంగా కియోస్క్ యంత్రం
- వైసీపీ ఏలుబడిలో రూ.3.50 కోట్లు వృథా
- అప్పట్లో 520 ఆర్బీకేల్లో ఏర్పాటు
- ఐదేళ్లు నిర్వహణ ఊసే ఎత్తని జగన్ సర్కార్
- ఇంటర్నెట్ సౌకర్యంపై చేతులెత్తేసిన వైనం

మెంటాడ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రైతులను ఉద్ధరిస్తున్నామని చెప్పుకొంటూ గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో ఎంతో ఆర్భాటంగా రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి ఒక్కోకేంద్రంలో రూ.67 వేల వ్యయంతో కియోస్క్ యంత్రాన్ని సమకూర్చింది. విత్తనాల సరఫరా నుంచి పంట చేతికందేవరకు రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహనకు ఇవి దోహదపడతాయని ప్రకటించారు. జిల్లాలో 520 రైతుభరోసా కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేశారు. వీటిపై రూ.3,48,40,000 ఖర్చుచేశారు. రైతులకు అందుబాటులో ఉంచేందుకు ఆర్బీకేలోని గ్రామీణ వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ, పశుసంవర్థక, మత్స్యశాఖ సిబ్బంది శాఖలవారీగా సమాచారాన్ని వాటిలో అప్లోడ్ చేస్తే ఆర్బీకేకు వచ్చిన రైతులు సిబ్బందితో ప్రమేయం లేకుండా కియోస్క్ నుంచి అన్ని వివరాలు తెలుసుకునేందుకు వీలుపడుతుందని చెప్పుకొచ్చారు.

కియోస్క్‌లను తీసుకొచ్చిన ప్రభుత్వం ఆ యంత్రాల వినియోగంపై రైతులకు కనీస అవగాహన కల్పించకపోవడంతో మొదటిరోజునుంచే అవి దిష్టిబొమ్మల్లా ఉండిపోయాయి. రైతులు, వ్యవసాయ సిబ్బంది మధ్య సమన్వయం మాన్యువల్ పద్ధతిలోనే జరిగింది. మరో గమ్మత్తేమంటే ఈ యంత్రాల నిమిత్తం ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తామని ప్రారంభంలో చెప్పిన అప్పటి జగన్ సర్కార్ తర్వాత ఆ ఊసే ఎత్తలేదు. చేసేదిలేక ఆర్బీకే సిబ్బంది తమ మొబైళ్లలోని డేటాతో కొన్నాళ్ళు మమ అనిపించి క్రమంగా ఆ యంత్రాలకే దండం అంటూ దూరంపెట్టేశారు. దీంతో వాటి కోసం ఖర్చుచేసిన సుమారు మూడున్నర కోట్ల రూపాయలు బూడిదలో పోసిన (మిగతా 8వ పేజీలో..)

గౌతు లచ్చన్న ఆదర్శనీయుడు

- నమ్మిన సిద్ధాంతం కోసం రాజీ లేని పోరాటం: మంత్రి కొండపల్లి



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న ఆదర్శనీయుడని, భావితరాలకు ఆయనో స్ఫూర్తి అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. గౌతు లచ్చన్న జయంతిని ప్రభుత్వం తొలిసారిగా అధికారికంగా నిర్వహించింది. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై గౌతులచ్చన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ, తాను నమ్మిన సిద్ధాంతం కోసం రాజీ పడకుండా, జీవితాంతం పోరాటం చేసిన వ్యక్తి లచ్చన్న అని అన్నారు. 1978లోనే చట్టసభలో ప్రతిపక్ష నేతగా, పీఏసీ ఛైర్మన్‌గా, మంత్రిగా, ప్రజానాయకుడిగా విశేష సేవలు అందించారన్నారు. జిల్లాలో గౌతు లచ్చన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి (మిగతా 8వ పేజీలో..)



వానొస్తే అవస్థే

వాన పడితే కొత్తవలస జంక్షన్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ప్రజలకు నరకయాతనే. బ్రిడ్జి వద్ద భారీగా నీరు చేరి రాకపోకలకు స్తంభిస్తున్నాయి. శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షాలకు ప్రస్తుతం అక్కడ రాకపోకలు ఆగిపోయాయి. ఆ నీటిని మోటార్లతో తోడే వరకు అటుగా వెళ్లలేరు. శనివారం ఉదయం కొందరు అవస్థలు పడుతూ వెళ్లడం కనిపించింది. ఆ తర్వాత మరింత నీరు చేరిపోవడంతో వెళ్లిరావడం పూర్తిగా ఆగిపోయింది. కనీసం నడచి వెళ్లేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని రైల్వేశాఖను ఎన్నిసార్లు కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కొత్తవలస, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి)

ఆశలు వెల్లివిరిసేలా..

- ఆశా కార్యకర్తలపై వరాల జల్లు
- పూర్తి వేతనంతో కూడిన ఆరునెలల ప్రసూతి సెలవులు
- ఉద్యోగ విరమణ తరువాత ప్రతి నెలా గ్రాట్యుటీ



రాజాం/ రూరల్/ గజపతినగరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి సంవత్సరాలుగా పోరుబాట సాగిస్తున్న ఆశా కార్యకర్తల ఆశలు ఫలించాయి. ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు సత్ఫలితాలిచ్చాయి. వారి న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుంది. వరాలు కురిపించింది. దీంతో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తూ వారు ప్రకటనలు ఇస్తున్నారు.

- పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో మాతా, శిశు సంరక్షణ, జాతీయ ఆరోగ్యకార్యక్రమాల అమలు, ప్రభుత్వాసుపత్రులలో ప్రసవాల పెంపు, సీజనల్, ప్రాణాంతక వ్యాధులపై ప్రజల్లో అవగాహన తదితర కీలకమైన వైద్య ఆరోగ్య సేవల్ని ఆశా కార్యకర్తలు అందిస్తున్నారు. అయితే ప్రజారోగ్య పరిరక్షణలో కీలకంగా వ్యవహరిస్తున్న వీరి పట్ల గత ప్రభుత్వం చిన్నచూపు చూసింది. వారి ఆవేదనను పట్టించుకోలేదు. ఆందోళనలను అణచివేసింది. వారిపై ఉక్కుపాదం మోపింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ఆశా కార్యకర్తల ఆవేదనపై దృష్టి సారించింది. వారి ప్రధాన డిమాండ్లపై ఉన్నతాధికారులతో చర్చించింది. సానుకూలమైన డిమాండ్ల అమలుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకోసం జీవో 94ను వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.టి.కృష్ణ బాబు విడుదల చేశారు. ఫలితంగా జిల్లాలో సుమారు 2వేల మంది వరకూ ఆశ కార్యకర్తల్లో ఆనందోత్సాహాలు వెల్లువిరుస్తున్నాయి.

వరాలు ఇవే..

ఆశా వర్కర్లకు ఇప్పటివరకూ లేని మెటర్నిటీ లీవ్‌ను ఆరునెలలు (180 రోజులు) పూర్తివేతనంతో (మిగతా 8వ పేజీలో..)

శుభ పరిణామం

కూటమి ప్రభుత్వ తాజా ప్రకటన ఆశా కార్యకర్తలకు ఎంతో శుభపరిణామం. ఏళ్లుగా చేసిన పోరాటాలకు ఇన్నాళ్లకు ఫలితం దక్కనుంది. గ్రాట్యుటీ చెల్లింపు, ఉద్యోగ విరమణ విషయంలో ఇంకా స్పష్టంగా వివరించాల్సి ఉంది. ఏదేమైనా ఆశవర్కర్లకు ఎంతో మేలు కలగనుంది. జిల్లాలోని ఆశ వర్కర్లందరి తరపున రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

- రామ్మూర్తినాయుడు, ఆశా కార్యకర్తల సంఘ గౌరవాధ్యక్షుడు

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. చాలా రోజులుగా సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నాం. ప్రసూతి సెలవులు ప్రకటించడం బాగుంది. రూ.1.50 లక్షల గ్రాట్యూటీ చెల్లింపు, పదవీ విరమణ వయసు పెంచడం ఆనందంగా ఉంది. గౌరవ వేతనం కూడా పెంచాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకోవాలి.

- తులసీరత్నం, ఆశా కార్యకర్త, రాజాం

స్త్రీశక్తి సందడి **6**

- బస్సుల్లో ఉచిత ప్రయాణంపై మహిళల్లో ఆనందం
- తొలిరోజు జిల్లాలో రెండు వేల మంది సద్వినియోగం

సాగని వేట **6**

- అల్లకల్లోలంగా సముద్రం
- తీరానికే పరిమితమైన పడవలు
- అవస్థలు పడుతున్న మత్స్యకారులు



'అన్నదాత సుఖీభవ' విజయోత్సవ ర్యాలీ **6**

- బొబ్బిలిలో 120 ట్రాక్టర్లతో నిర్వహణ

మన్యం జిల్లాలో విలీనం చేయాలి **8**

- బొబ్బిలిలో రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం



స్త్రీ శక్తి సందడి

- బస్సుల్లో ఉచిత ప్రయాణంపై మహిళల్లో ఆనందం
- జీరోఫేర్ టిక్కెట్లతో ఉత్సాహంగా ప్రయాణిస్తున్న వైనం
- తొలిరోజు విజయనగరం జిల్లాలో 2వేల మంది సద్వినియోగం
- రెండు డిపోల పరిధిలో నెలకు ప్రభుత్వంపై రూ.కోటి భారం
- అన్నివర్గాల మహిళలకు మేలు



● నాపేరు పార్వతి. మాది మన్యం జిల్లా అంటివలస గ్రామం. నా కూతురు విజయనగరంలో ఉంటుంది. వారంలో రెండుమూడు సార్లు నేను విజయనగరం వస్తాను. సుమారు రూ.500 చార్జీలకు ఖర్చుఅయ్యేది. ఇప్పుడు ఆ ఖర్చులేదు.



● వీరి పేర్లు సౌమ్య, గ్రీష్మా. ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు. రోజూ బస్సులో విజయనగరానికి చదువుకోవటానికి వస్తుంటారు. గ్రీష్మాది గరివిడి గ్రామం. సౌమ్యాది ఎస్.కోట మండలం. సౌమ్యకి ప్రతిరోజు కాలేజికి రావటానికి రూ.100 వరకు ఖర్చు అవుతుంది. ఇప్పుడా ఖర్చులేదంటుంది. గ్రీష్మాకు బస్ పాస్ ఉంది. ఇక నుంచి దాని అవసరం లేదని అంటుంది.

విజయనగరం/పార్వతీపురం/పార్వతీపురంటౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకంపై మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జీరోఫేర్ టిక్కెట్‌తో బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. శనివారం ఉమ్మడి జిల్లాలోని వివిధ ఆర్టీసీ బస్టాండ్ల వద్ద మహిళా ప్రయాణికులతో సందడి నెలకొంది. బస్సుల్లో ప్రయాణించేందుకు వారు ఉత్సాహం చూపించారు. కండక్టర్లకు ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డులు చూపించి, జీరో చార్జీ టిక్కెట్ తీసుకొని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించారు. స్త్రీ శక్తి పథకంపై అన్ని వర్గాల మహిళల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, కొందరు గ్రామీణ మహిళలకు ఈ పథకంపై అవగాహన కొరవడింది. ఆధార్‌కార్డుతో పాటు ఇతర గుర్తింపు కార్డులు తమతో తెచ్చుకోలేదు. దీంతో వారు చార్జీ చెల్లించి టిక్కెట్ తీసుకున్నారు. ఇలాంటి వారికి అధికారులు, కూటమి నాయకులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

విజయనగరం జిల్లాలో పరిస్థితి..

విజయనగరం, ఎస్.కోటలో బస్సు డిపోలు ఉన్నాయి. ఈ డిపోల్లో అన్నిరకాల బస్సులు 160 ఉన్నాయి. అందులో 137 బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి అవకాశం ఉంది. మిగతావి ప్రీమియర్ సర్వీసులుగా ఉన్న నాన్‌స్టాప్, లగ్జరీ, సూపర్ డీలక్స్ బస్సులే. రోజుకు అన్నిరకాల బస్సులు 63 వేల కిలోమీటర్లు తిరుగుతుంటాయి. 41 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అందులో మహిళా ప్రయాణికులు 12 వేల మంది ఉంటారు. వీరిద్వారా రూ.24 లక్షలు టిక్కెట్ల రూపంలో వసూలయ్యేది. ఉచిత ప్రయాణం నేపథ్యంలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ 2వేల మందికి పైగా మహిళలు ప్రయాణించారు. దీనివల్ల ఒక్కరోజే ప్రభుత్వంపై రూ.1.30 లక్షలకుపైగా భారం పడింది. ఈరెండు డిపోల పరిధిలో సరాసరి నెలకు ఉచిత ప్రయాణ పథకం ద్వారా రూ.కోటి భారం పడే అవకావం ఉందని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి.

ఒక్కో కుటుంబానికి రూ.4 వేలు లబ్ధి..

స్త్రీశక్తి పథకం ద్వారా సగటున ప్రతి కుటుంబానికి నెలకు రూ.4 వేలు లబ్ధి కలగనుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకుంటారని భావిస్తోంది. ప్రస్తుతం ప్రతి ఇంట్లో మహిళలతో పాటు విద్యార్థినులు ఉంటున్నారు. ఆపై ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేసే మహిళలు, ఉపాధి పనులకు వెళ్లే ఆడవారు ఉంటున్నారు. వీరంతా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం వల్ల ఆ కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. ప్రస్తుతం వ్యవసాయ పనులు జోరుగా సాగుతుండడం, పథకం ప్రారంభ సమయం కావడంతో మహిళా ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉంది. క్రమేపీ రద్దీ పెరిగే అవకాశం ఉంది. రద్దీని దృష్టిలో పెట్టుకొని బస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసే పనిలో ఉంది ఆర్టీసీ యంత్రాంగం. మరోవైపు కాంప్లెక్స్‌లతో పాటు బస్టాండ్లలో తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులోకి తెస్తున్నారు. ప్రయాణికులు వేచి ఉండేందుకు బెంచీలతో పాటు ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తానికైతే జిల్లాలో ఉచిత ప్రయాణానికి సంబంధించి మహిళల నుంచి విశేష స్పందన వస్తోంది.

మంచి అవకాశం..



ఉచిత బస్సు పథకం మాలాంటి వృద్ధులకు మంచి అవకాశం. మాది వీరఘటం. పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి వారం రోజులకొకసారి రావాలంటే కనీసం చార్జీలకు రూ.100 వరకు ఖర్చు అయ్యేది. ఇప్పుడు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీనివల్ల చార్జీల భారం తప్పింది. మరో పదేళ్ల ఈ ప్రభుత్వం పాలన సాగించాలి.

-వి.అప్పలనరసమ్మ, వీరఘట్టం గ్రామం

గృహిణులకు ఒక వరం..



మాలాంటి గృహిణులకు స్త్రీ శక్తి పథకం వరం లాంటిది. పండుగలు, సెలవు దినాల్లో మా కుటుంబాలను కలుసుకోవడానికి ఎలాంటి చార్జీలు లేకుండా బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇలాంటి పథకాన్ని ప్రవేశ పెట్టడం ఆనందంగా ఉంది.

-శిరీష, గృహిణి, పార్వతీపురం

చార్జీ మిగులుతుంది..



వ్యవసాయ కూలీలుగా ఉండే మాలాంటి వారు చార్జీ లేకుండా బస్సుల్లో ప్రయాణించడం వల్ల టిక్కెట్ సొమ్ము మిగులుతుంది. నేను వ్యవసాయ పని కోసం వీరఘట్టం నుంచి ఖడ్గవలసకు ప్రతిరోజూ వెళ్తుంటా. ఆటో ఎక్కాలంటే కనీసం రూ.20 చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు ఉచిత బస్సుతో చార్జీల భారం తప్పింది. బస్సు ఎక్కి ఆధార్ చూపించగానే కండక్టర్ జీరో చార్జీ టిక్కెట్ ఇచ్చారు.

-అచ్చియమ్మ, కంబర, వీరఘట్టం మండలం

వేడుకగా కృష్ణాష్టమి

- గోపిక, కృష్ణుల వేషధారణల్లో చిన్నారులు
- ఉట్టికొట్టేందుకు యువత పోటీ

శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. విజయనగరం, పార్వతీపురం, పాలకొండ, నెల్లిమర్ల, గరివిడి, చీపురుపల్లి, దత్తిరాజేరు, గజపతినగరం, ఎస్.కోట, గంట్యాడ, బొబ్బిలి తదితర మండలాల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఉదయం రాధా కృష్ణ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారి తిరువీధి కార్యక్రమం చేపట్టారు. మహిళలు సామూహిక పూజలు చేశారు. ఇళ్లల్లో చిన్నారులను కృష్ణుడు, గోపికలుగా అలంకరించారు. అనంతరం ఉట్టి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉట్టి కొట్టేందుకు యువత, చిన్నారులు పోటీపడ్డారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో జిల్లా అంతటా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

-ఆంధ్రజ్యోతి బృందం



పాలకొండ: ఎన్‌కే రాజపురంలో ప్రతిష్ఠించిన శ్రీకృష్ణుని విగ్రహం



పార్వతీపురం/టౌన్: గీతా మందిరంలో..



బొబ్బిలిరూరల్: కోరాడ వీధి అంగన్‌వాడీ కేంద్రంలో ..



విజయనగరం రూరల్: గురజాడ కళాభారతి ఓపెన్ ఆడిటోరియంలో..



పార్వతీపురం/టౌన్: రాధాకృష్ణుల తిరువీధి



మక్కువ: యాదవీధిలో ఉట్టికొడుతున్న యువత



గుమ్మలక్ష్మీపురం: ఉట్టికొట్టేందుకు సిద్ధమవుతున్న యువత, చిన్నారులు



ఎస్.కోట రూరల్: వేణుగోపాలస్వామికి 108 ప్రసాదాలతో నైవేద్యం



అవార్డుతో రాజాం సమాఖ్య ప్రతినిధులు

రాజాం మహిళా సమాఖ్యకు జాతీయ అవార్డు

రాజాం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాజాం మహిళా సమాఖ్యకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. జాతీయ స్థాయిలో ఉత్తమ మండల సమాఖ్యగా అవార్డు పొందింది. ఈ మేరకు శుక్రవారం డిల్లీలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో ఆత్మనిర్భర్ భారత సంఘటన్ అవార్డును కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేతులు మీదుగా సమాఖ్య ప్రతినిధులు పురస్కారం అందుకున్నారు. రూ.లక్ష చెక్కుతో పాటు సర్టిఫికెట్, జ్ఞాపిక అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సెర్ప్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌పాణి, ఏపీడీ సావిత్రికి రాజాం సమాఖ్య అధ్యక్షురాలు రౌతు వెంకటమ్మ, కోశాధికారి కొయ్యాన పార్వతి అభినందనలు తెలిపారు.

సంతోషంగా ఉంది..

రాజాం మహిళా సమాఖ్యకు జాతీయ సాయిలో ఆత్మనిర్భర్ అవార్డు రావడం ఆనందంగా ఉంది. గ్రామీణ మహిళల ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జీవనోపాధుల పెంపు, నిరంతర కృషితో పాటు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు అందించిన సహకారంతో ఈ విజయం సాధ్యమైంది. ఈ అవార్డు కోసం 3 సంవత్సరాల నుంచి కృషి చేస్తున్నాం. ఇన్నాళ్లకు ఫలించడం ఎంతో సంతోషంగా ఉంది.

-చిరంజీవి, ప్రాజెక్టు మేనేజర్, సెర్ప్, డీఆర్‌డీఏ



ముక్కాం సముద్ర తీరంలో ఉంచిన పడవలు

సాగని వేట

- అల్లకల్లోలంగా సముద్రం
- తీరానికే పరిమితమైన పడవలు
- అవస్థలు పడుతున్న మత్స్యకారులు

భోగాపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా గత నాలుగు రోజులుగా సముద్రం అల్లకల్లోలంగా మారింది. సుమారు 50 మీటర్లు ముందు కొచ్చింది. దీనికి తోడు వర్షాలు కురుస్తుండడంతో సముద్రంలో వేట సాగక మత్స్యకారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని సముద్రతీర మండలాలైన భోగాపురం, పూసపాటిరేగలో ముక్కాం, చిన కొండ్రాజుపాలెం, పెద కొండ్రాజుపాలెం, ఎర్రమునలయ్యపాలెం, చేపలకంచేరు, కొత్తూరు, చింతపల్లి, నీలగెడ్డ పేట, బర్రిపేట, పెద్దూరు, కొత్తూరు, తమ్మయ్యపాలెం, బర్రిపేట, తిప్పలవలస, కోనాడ, బొడ్డుగురయ్యపేట, పులిగెడ్డ తదితర మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో సుమారు 20వేల జనాభా ఉండగా, సుమారు 5వేల మందికి పైగా చేపలవేట, అమ్మకాలుపై ఆధారపడి జీవిస్తున్నారు. అయితే గత నాలుగు రోజులుగా వాతావరణం అనుకూలించక, ఈదురు గాలులు వీస్తుండడంతో చేపల వేట నిలిచిపోయింది. మత్స్యకారులు తీరానికే పరిమితమయ్యారు. వేట లేని సమయంలో ప్రభుత్వం ఆదుకుంటే బాగుంటుందని మత్స్యకారులు కోరతున్నారు.

‘అన్నదాత సుఖీభవ’ విజయోత్సవ ర్యాలీ

- బొబ్బిలిలో 120 ట్రాక్టర్లతో నిర్వహణ




ట్రాక్టర్ల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు

బొబ్బిలి ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో రైతులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయడంతో శనివారం ఎమ్మెల్యే బేబీనాయన ఆధ్వర్యంలో రైతులు 120 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ చేపట్టారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఈ ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. బుడాచైర్మన్ తెంటు లక్ష్మునాయుడుతో కలిసి ఆయన ట్రాక్టర్‌పై కూర్చొని విక్టరీ సింబల్ చూపిస్తూ ముందుకు సాగారు. ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి మీదుగా రైల్వేజంక్షన్, పోలీసు స్టేషన్ రోడ్డు, జెండావీధి, చర్చిసెంటరు మీదుగా వ్యవసాయమార్కెట్ కమిటీ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. రైతులంతా కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు జేజేలు పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబీనాయన, బుడాచైర్మన్ తెంటు మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ హామీలో భాగంగా పీఎం కిసాన్.. అన్నదాత సుఖీభవ పథకాల కింద రైతులకు ఏటా రూ.20వేలు అందజేస్తారని తెలిపారు. తొలివిడతగా వారి ఖాతాల్లో రూ.7వేలు చొప్పున జమచేశారని అన్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో 35,084 మంది రైతులకు రూ.24.24 కోట్లు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు అల్లాడ భాస్కరరావు, చింతల రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి ప్రధాన రహదారిపై ట్రాక్టర్ల ర్యాలీ..

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు



ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి, ప్రజాశాంతికి భంగం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్టు తెలిపారు. మద్యం తాగి, ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్నవారిపై దాడులు చేయాలని, కేసులు నమోదు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అలాగే పట్టుబడ్డ మైనర్లకు, మందుబాబులకు కౌన్సి లింగ్ ఇవ్వాలన్నారు. నగర శివారులోని లేఅ వుట్లు, గ్రామ శివారు ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం తాగే వారిపైనా పోలీసు అధికారులు, సిబ్బంది డ్రోన్స్ దాడులు నిర్వహిస్తారన్నారు. తాగి వాహనం నడిపే వారిపై కేసులు నమోదు చేస్తున్నామని, రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘించిన వారిపై ఈ చలానాలు విధిస్తున్నామన్నారు. ఈ ఏడాది బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై 13,260 కేసులు నమోదు చేశామన్నారు. ఇటువంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు.

రెగ్యులర్ పీవోను నియమించాలి

- ఏజేఏసీ అధ్యక్షుడు శ్రీనివాసరావు డిమాండ్

సీతంపేట రూరల్,ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏకు రెగ్యులర్ పీవోను నియమించాలని ఏజేఏసీ అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు డిమాండ్ డిమాండ్ చేశారు. ఈ ప్రాంత గిరిజనుల మనోభావాలు గుర్తించని, సమస్యలు పరిష్కరించలేని ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డిని తిరిగి ఐటీడీఏ రెగ్యులర్ పీవోగా కొనసాగించవద్దని కోరారు. శనివారం సీతంపేటలో ఏజేఏసీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలకొండ సబ్‌కలెక్టర్‌గా గతంలో పనిచేసిన యశ్వంత్‌కుమార్‌రెడ్డిని ప్రభుత్వం ఇక్కడ నుంచి బదిలీ చేసిందని, ఆయన తిరిగి సీతంపేట ఐటీడీఏకు రెగ్యులర్ పీవోగా కొనసాగేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. జీవో-3 పునరుద్ధరణ కోసం రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల పరిధిలో ఇటీవల ప్రజాభిప్రాయ సేకరణ, వర్క్‌షాప్ జరిగిందని తెలిపారు. పీవో లోపం వల్ల సీతంపేట ఐటీడీఏలో మాత్రం గిరిజనుల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ జరగలేదని ఆరోపించారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, అభివృద్ధిని పీవో పట్టించుకోలేదన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉన్న ఆదలీ వ్యూపాయింట్ నిర్వహణకు గిరిజనేతరులకు అనుమతులు ఇవ్వడం, ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో నిర్వహణ లోపం, ఏజెన్సీలో 1/70 చట్టం అమలు, ఏఎల్‌టీఆర్ కేసులు, గిరిజనేతరుల భవన నిర్మాణాలకు అనుమతులు, జీసీసీ స్థలం లీజు వంటి అంశాల్లో పీవో వైఫల్యం కనిపిస్తున్నట్లు భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏజేఏసీ కార్యదర్శులు బి.ఉమామహేశ్వరరావు, కె.భాస్కరరావు, ఎన్.కాంతారావు, టి.తిరుమలరావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

మెరకముడిదాం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. మెరకముడిదాంలో రూ.8కోట్ల 90లక్షల విలువ గల ఐదు బీటీ రోడ్డు పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన 14నెలల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేసిందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు తాడ్డి సన్యాసినాయుడు, భైరిపురం ఏఎంసీ ఛైర్మన్ తాడ్డి చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ కోట్ల మోతీలాల్‌నాయుడు, పార్టీ నాయకులు కెంగువ ధనుంజయ, సుబ్బరాజు, జనసేన పార్టీ మండల అధ్యక్షురాలు రౌతు కృష్ణవేణి, ఎంపీడీవో జి.భాస్కరరావు, తహసీల్దార్ సులోచనరాణి, పంచాయతీరాజ్ ఏఈ హరికృష్ణ పాల్గొన్నారు.

నానో చిప్‌ల తయారీకి సెంచూరియన్ విద్యార్థులు సిద్ధం



స్టాల్ ప్రారంభిస్తున్న ఉపాధ్యక్షుడు డీఎన్ రావు

నెల్లిమర్ల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది భారత్ తొలిసారిగా స్వదేశీ పరిజ్ఞానంతో సెమి కండక్టర్ తొలి చిప్‌ను తయారు చేయనుండగా, సెంచూరియన్ విద్యార్థులు కూడా తొలిసారిగా చిప్‌ను తయారు చేయబోతున్నారని విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్.రావు వెల్లడించారు. శనివారం ఆయన విశ్వవిద్యాలయంలో స్టాల్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది నాటికి సెంచూరియన్ విద్యార్థులు ఏడు రకాల చిప్‌లను తయారు చేయడానికి కృషి చేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడి సతీమణి పద్మ, వైస్ చాన్సలర్ ప్రశంత్‌కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డా.పల్లవి తదితరులు పాల్గొన్నారు.

రేపు అలా హజరత్ ఉత్సవాలు

విజయనగరం రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 18 నుంచి రెండు రోజుల పాటు సయ్యది అలా హజరత్ ఉత్సవాలు సున్నీ మసీదులో నిర్వహించనున్నట్టు పట్టణ శాఖ ముస్లింల ప్రతినిధి మహ్మద్ గౌస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ ఉత్సవాలు నిర్వహించనున్న సందర్భంగా జిల్లాలో కూడా శృంగవరపుకోట, కురుపాం, సాలూరు, పార్వతీపురం-మన్యంలో ఉన్న సున్నీ మసీదుల్లో నిర్వహిస్తారని తెలిపారు. నగరంలోని ఆబాద్‌వీధిలో ఉన్న మదర్‌సా అల్ జామి యతుల్ హబీబీయా, అహ్మదియా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉత్సవ ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు. సున్నీ ముస్లింలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పేదలకు అల్పాహారం పంపిణీ

రాజాం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు రవణంస్వామినాయుడు సూచన మేరకు అంతికాపల్లి గ్రామంలో వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవెంకట దుర్గా ఆగ్రో వర్క్స్ అధినేత గుణుపూర్ శ్రీనివాసరావు, ఫ్యాన్స్ ప్రెసిడెంట్ వి.చంద్రశేఖర్, కె.జనార్దన్, మెగా ఫ్యామిలీ సేవకుడు గోకా కొండలరావు, ఎ.శ్రీనివాస్, వి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మీడియేషన్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన

కొత్తవలస, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కోర్టులలో ఉన్న రాజీకి వీలుపడే కేసులను శనివారం కొత్తవలస కోర్టులో మీడియేషన్ కమిటీ ఆధ్వర్యంలో రాజీకి ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో పలు కేసులకు సంబంధించి పార్టీలు హాజరు కాగా, మీడియేషన్ కమిటీ సభ్యులు డి.శ్రీనివాస్, నందిపల్లి శ్రీరామమూర్తి.. వీరికి అవగాహన కల్పించారు. కేసులు రాజీ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

చిన్నశిర్లాంలో లోఓల్టేజీ సమస్యకు చెక్

రేగిడి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో లోఓల్టేజీ సమస్యకు ఎట్టకేలకు చెక్ పడింది. శనివారం స్థానిక ఏఈ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది ఆ గ్రామంలో సింగల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చారు. ఈ గ్రామంలో దాదాపు 450 విద్యుత్ సర్వీసులు ఉండగా, అందులో 80 సర్వీసులకు లోఓల్టేజీ సమస్య ఉంది. ఇటీవల ఈ సమస్య స్థానిక విద్యుత్ ఏఈ దృష్టికి వెళ్లడంతో ఏపీఈపీడీసీఎల్ డీఈఈ, రాజాం ఏడీ ఫణికుమార్ ఆదేశాలతో రూ.4.50లక్షల అంచనాతో కొత్త సింగల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.కోట రూరల్, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఏపీ హోమ్స్, రామ్‌నగర్, పందిరప్పన్న జంక్షన్, పోలీస్‌స్టేషన్ ఏరియా, చెరకు కాటా, రైల్వేస్టేషన్ ఏరియా, ఎంకే రావు కాలనీ, ఎస్.కోట దేవీబొమ్మ ఏరియా, ఎంఆర్‌వో, ఎంపీడీవో కార్యాలయాల ఏరియా, ప్రభుత్వ ఆసుపత్రి, బర్మా కాలనీ, పుణ్యగిరి లేఅవుట్, రేగ పుణ్యగిరి, పుణ్యగిరి ఏరియాలో విద్యుత్ ఉండదని చెప్పారు.

పార్కింగ్ ఇలా.. రాకపోకలు ఎలా?

- జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిపేస్తున్న వైనం
- వెలగని వీధి దీపాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, వ్యాపారులు
- ఇదీ గజపతినగరం, పురిటిపెంట పంచాయతీల పరిస్థితి

గజపతినగరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గజపతినగరంలోని జాతీయ రహదారికి ఇరు వైపులా యథేచ్ఛగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో స్థానికులతో పాటు వ్యాపారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. గత ఏడాది జాతీయ రహదారి విస్తరణలో భాగంగా స్థానిక చంపావతి వంతెన నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు 1.2 కిలోమీటర్ల మేర పనులు చేపట్టారు. అలాగే మేజర్ పంచాయతీ గజపతినగరం తోపాటు పురిటిపెంట పంచాయతీలకు సంబంధించి రోడ్డు మధ్యలో వీది లైట్లు ఏర్పాటు చేశారు. ఈ విస్తరణ పనులతో ట్రాఫిక్ సమస్య తొలగిపోతుందని స్థానికులు, వ్యాపారులు ఆశించారు. అయితే రోడ్డు విస్తరణ తర్వాత షాపుల ముందే గంటల కొద్దీ వాహనాలు నిలిపి వేస్తున్నారని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. తమ షాపులకు వినియోగదారులు వచ్చే పరిస్థితి లేకుండా పోతుందని వాపోతున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పరిస్థితి మారడంలేదన్నారు. అలాగే రెండు పంచాయతీలకుగాను ఏర్పాటు చేసిన వీధిలైట్లు రాత్రి వేళల్లో వెలగకపోవడంతో వ్యాపారాలు సాగడం లేదని తోపుడుబళ్ల వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గజపతినగరంలో రహదారి పక్కన పార్కింగ్ చేసిన వాహనాలు

ఆక్రమణల కారణంగానే..

మెంటాడ రోడ్డు ఇరువైపులా ఆక్రమణలకు గురి కావడంతో వాహనచోదకులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలిపివేస్తున్నారు. ఆటోలను ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇళ్ల ముందే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి ఉందని గృహ యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించే దిశగా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులతో పాటు వ్యాపారులు కోరుతున్నారు.

నోటీసులు జారీ చేశాం..

దీనిపై పురిటిపెంట పంచాయతీ ఈవో జనార్దనరావును వివరణ కోరగా.. ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశామని చెప్పారు. ఇదివరకు హెచ్చరికలు జారీ చేశామన్నారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలి.. లేనిఎడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పెండింగ్ బిల్లులు విడుదల

- 2014-19లో ఎన్‌ఆర్‌జీఎస్‌లో భాగంగా చేపట్టిన పనులకు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కానున్న నిధులు

ఎస్.కోట నియోజకవర్గానికి రూ.4.20కోట్లు

లక్కవరపుకోట, ఆగస్టు 16(ఆంధజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మినీ గోకులాలకు, సీసీ రోడ్లుకు పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేసిందని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. శనివారం ఆమె లక్కవరపుకోటలోని తన నివాసంలో సుమారు 500 మంది రైతులతో సమావేశమయ్యారు. నియోజక వర్గంలోని 5 మండలాలకు సుమారు రూ.4.20 కోట్లు విడుదలయ్యాయని చెప్పారు. అందుకు సంబంధించిన పత్రాలను రైతులకు అందజేశారు. 2014-19లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పాడి రైతులకు మినీ గోకులాలు, గ్రామాల అభివృద్ధికి సీసీ రోడ్లు మంజూరు చేశారని, అప్పట్లో కొంతమేర బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయని ఆమె తెలిపారు. ఆ తర్వాత వచ్చిన జగన్మోహన్ రెడ్డి వాటన్నింటినీ తుంగలోకి తొక్కేశారని మండిపడ్డారు. మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం వాటన్నింటికీ బిల్లులు మంజూరు చేసి, రైతుల కళ్లలో ఆనందం నింపిందన్నారు. విడుదలైన నిధుల్లో గోకులం షెడ్లు, సీసీ రోడ్లు, ఎస్‌డబ్ల్యూసీ షెడ్లు, శ్మశాన వాటిక షెడ్లు ఉన్నాయన్నారు. ఎస్.కోట మండలానికి 156 మందికి 169 పనులకు సంబంధించి రూ.43 లక్షలు, కొత్తవలస మండలానికి 82 మందికి 243 పనులకు సంబంధించి రూ.కోటి 20లక్షలు, జామి మండలానికి 76 మందికి 124 పనులకుగాను సుమారు రూ.35లక్షల 50వేలు, వేపాడకు సంబంధించి 150 మందికి 187 పనులకుగానూ సుమారు 50 మందికి 187 పనులకు గానూ సుమారు రూ.50లక్షలు, ఎల్.కోటకు సంబంధించి 395 మందికి 474 పనులకు సుమారు కోటి రూపాయలకుపైగా నిధులు విడుదలైనట్టు చెప్పారు. ఈ వారంలో వీరందరికీ వారి ఖాతాల్లో నగదు జమ కానున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, కొల్ల శ్రీను, రత్నాజీ, దుర్గా ఉమేష్, డీఈ స్వామినాయుడు, 5 మండలాల పీఆర్ ఇంజనీర్లు, ఏపీవోలు, ఈసీలు, టీఏలు, ఎఫ్ఏలు, రైతులు హాజరయ్యారు.



లక్కవరపుకోట: నిధులు మంజూరు అయినట్లు తెలుపుతున్న ఎమ్మెల్యే లలితకుమారి



డెంకాడ: మాట్లాడుతున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి

నెల్లిమర్ల నియోజకవర్గానికి రూ.73.58లక్షలు

డెంకాడ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నియోజకవర్గంలో 2014-19 ఆర్థిక సంవత్సంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించిన నిధులను కూటమి ప్రభుత్వం విడుదల చేసిందని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. శనివారం డెంకాడ వెలుగు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. 2014-19 సంవత్సరాల్లో ఎన్‌ఆర్‌జీఎస్ ద్వారా చేపట్టిన గోకులం షెడ్ల లబ్ధిదారులకు పెండింగ్ నిధులను వారి ఖాతాల్లోకి జమ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆమె తెలిపారు. నియోజకవర్గంలో 340 ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకుగాను సుమారు రూ.73.58లక్షల నిధులను వండర్స్ ద్వారా విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నరని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకోండి

- ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు

చీపురుపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గతంలో ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఆదేశించారు. 2014-2019 సంవత్సరాల మధ్య నిర్వహించిన ఉపాధి పనులపై ఆయన నాలుగు మండలాల అధికారులతో శనివారం చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆ సమయంలో జరిగిన పనులకు గత ప్రభుత్వం బిల్లు చెల్లింపులు నిలిపివేసిందని ఆయన తెలిపారు. ఈసందర్భంగా నాలుగు మండలాల అధికారులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద సుమారు 500 పనులు జరిగాయని, ఈ పనులకు సంబంధించి రూ.91లక్షలు చెల్లించాల్సి ఉందని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ చెల్లింపులు సత్వరమే జరిగేలా చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఐ.సురేష్, ఏపీవో ఆదిబాబు, నియోజకవర్గంలోని ఎంపీడీవోలు, ఏపీవోలు, పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, ముల్లు రమణ, తాడ్డి సన్యాసినాయుడు, పైల బలరాం, సారేపాక సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి



నివాళులు అర్పిస్తున్న విద్యార్థినులు

లక్కవరపుకోట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్వతంత్ర సమర యోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని జమ్మాదేవిపేట వద్దగల ఎంజేపీ పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ పాత్రో, ఉపాధ్యాయిని భార్గవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

- గంట్యాడ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏపీ కల్లుగీత వృత్తిదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం సర్దార్ గౌతు లచ్చన్న జయంతి నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కొల్లి అప్పారావు మాట్లాడుతూ కల్లుగీత సహకార సంఘాలకు ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో జరిపించాలన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు పురం అప్పారావు పాల్గొన్నారు.

పశువులకు ఉచిత గర్భకోశ చికిత్సలు

వేపాడ ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కుమ్మపల్లిలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గర్భకోశ చికిత్సలు నిర్వహించినట్టు మండల పశు వైద్యాధికారి కోరాడ గాయత్రీ తెలిపారు. పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం

- ఏపీపీఆర్ఎంఈఏ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్

విజయనగరం టౌన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి పోరాటలే శరణ్యమని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌వీవీ రమేష్ అన్నారు. విజయనగరం జడ్పీ సమావేశ మందిరంలో శనివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు సంఘటితం కావాలని కోరారు. ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు అందరూ సమిష్టిగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఏపీ ఎన్జీవో ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎ.సురేష్, విశాఖపట్టణం జిల్లా అధ్యక్షుడు పి.సత్తబాబు, గంట్యాడ, నెల్లిమర్ల ఎంపీడీవోలు ఆర్‌వీ రమణమూర్తి, కె.రామకృష్ణరాజు, జడ్పీ ఏవో ఏ.వేదవతి, జడ్పీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఎస్ శ్రీనివాసరావు, కార్యదర్శి జి.హరిబాబు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా పీఆర్ఎం ఉద్యోగుల సంఘం ఎన్నిక

విజయనగరం టౌన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షుడిగా సీహెచ్ మురళీ, కార్యదర్శిగా పీఎం రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సం ఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌వీవీ.రమేష్, గౌరవ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. ఎన్నిక పరిశీలకులుగా విశాఖపట్టణం జిల్లా పంచాయ తీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు, తూర్పుగోదావరి జిల్లా ఏపీ ఎన్జీవో ఉద్యోగుల సంఘం సహాయ కార్యదర్శి ఎన్ఎంకేజే.ప్రసాద్ వ్యవహరించారు. అలాగే ఎన్నికల అధికారిగా విజయనగరం జిల్లా ఏపీ ఎన్జీవో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు టి.శ్రీధర్‌బాబు వ్యవహరించారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో అన్ని తాలూకా యూనిట్లలో ఓటర్లు పాల్గొన్నారు. నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోషియేట్ అధ్యక్షుడిగా బీవీ నాగభూషణ రావు, ఉపాధ్యక్షుడిగా టి.ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా వి.రాంబాబుతోపాటు మరికొంతమందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.



ఎన్నికైన పీఆర్ఎం ఉద్యోగుల సంఘం నాయకులు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- గోపికా కృష్ణుల వేషధారణతో అలరించిన చిన్నారులు

కృష్ణాష్టమి వేడుకలను జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మ కుమారీస్, యాదవ సంఘాల ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. చిన్నారులు గోపికా కృష్ణుల వేషధారణతో అలరించారు. శ్రీకృష్ణుని విగ్రహ ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



గరివిడి: ఓంశాంతి భవనంలో గోపికా కృష్ణుల వేషధారణలో చిన్నారులు



నెల్లిమర్ల: గోపాలకృష్ణ సంక్షేమ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఊరేగింపు



విజయనగరం రింగురోడ్డు: బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో..



కొత్తవలస: అప్పన్నపాలెంలో ఎమ్మెల్యే లలితకుమారి పూజలు



వేపాడలో భక్తుల పూజలు



గంట్యాడ అంగన్‌వాడీ కేంద్రంలో..

వ్యక్తి ఆత్మహత్య

దత్తిరాజేరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరిపేట గ్రామ సమీపంలో చెరువు గట్టుపై గల చెట్టుకు ఓ వ్యక్తి ఉరి వేసుకున్నాడు. ఈ ఘటన శనివారం చోటుచేసుకుంది. పెదమానాపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెంటాడ మండలం మీసాలపేట గ్రామానికి చెందిన మహంతి రామునాయుడు(45) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సొంత పనుల నిమిత్తం దత్తిరాజేరు మండలం దాసరిపేట గ్రామానికి వచ్చారు. అయితే అక్కడ చెరువు గట్టు మీద చెట్టుకు ఉరివేసుకున్నారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించారు. మృతుడికి భార్య రవణమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు పక్కన వ్యక్తి మృతి

భోగాపురం, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): భోగాపురం గ్రామంలోగల ఎత్తు బ్రిడ్జి సమీపంలో రోడ్డు పక్కన ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నట్టు సీఐ దుర్గాప్రసాదు శనివారం తెలిపారు. ఈ ఘటనపై సీఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడకు చెందిన లారీ డ్రైవర్ వీరాస్వామి(60) శనివారం విజయవాడ నుంచి భోగాపురానికి లారీపై సామగ్రిని తీసుకు వచ్చారు. సామగ్రిని వేరే వాహనాలకు తరలించేందుకు శ్రీకాకుళం వైపు నుంచి విశాఖ వైపు వెళ్లే మార్గంలో లారీని నిలుపుదల చేశాడు. ఇంతలోనే అనారోగ్య కారణమో.. మరే ఇతర కారణమో తెలియదు గానీ వీరాస్వామి తన లారీ పక్కన మృతిచెంది ఉన్నాడు. వాహన చోదకులు గమనించి, 108కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది వచ్చి, అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. దీనిపై వేరే లారీ డ్రైవర్ పల్నాడు జిల్లాకు చెందిన కుంబ జోషేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్సపొందుతూ ఒకరు..

సీతానగరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్జ గ్రామానికి చెందిన ఈదిబిల్లి బలరాంనాయుడు(62) శనివారం విజయనగరం మహారాజా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎస్ఐ ఎం.రాజేష్ కథనం మేరకు.. బలరాంనాయుడు వ్యక్తిగత కారణాల వల్ల మనస్థాపానికి గురై బుధవారం పురుగుల మందుతాగారు. వెంటనే పార్వతీపురం ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం విజయనగరం ఆసుపత్రిలో చేర్పించారు. ఈ మేరకు చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందారు. బలరాంనాయుడు భార్య అన్నపూర్ణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు ద్విచక్ర వాహనాల దగ్ధం

పాలకొండ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీకేరాజపురంలో శుక్రవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన దొర భానుప్రసాద్, పెద్దింటి సూరిబాబులకు చెందిన ద్విచక్రవాహనాలను అదే గ్రామానికి చెందిన జాడ దుర్గారావు పెట్రోల్‌తో ద్విచక్ర వాహనాలను దగ్ధం చేసినట్టు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ ప్రయోగమూర్తి దగ్ధమైన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. దుర్గారావుపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం జాడ దుర్గారావు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. గ్రామంలో అర్ధరాత్రి ద్విచక్రవాహనాలను తగులబెట్టడంతో గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు.

ఘనంగా ఏపీజీఈఏ వార్షికోత్సవం



మాట్లాడుతున్న ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ

విజయనగరం టౌన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) వార్షికోత్సవాన్ని శనివారం స్థానిక జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జెండాను జిల్లా అధ్యక్షుడు కంది వెంకటరమణ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకుడు సీహెచ్.శ్రీనివాస్‌కుమార్ ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి ఎల్‌వీ యుగంధర్, జిల్లా కార్యదర్శి బి.బాల భాస్కరరావు, అసోషియేట్ అధ్యక్షుడు పువ్వల శ్రీనివాసరావు, కోశాధికారి వై.శంకరరావు, ఉపాధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి జి.లక్ష్మీనాయుడు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు చింతల వెంకటసతీష్, బియ్యాల చంద్రశేఖర్, ఉపాధ్యక్షురాలు రంభ జ్యోతి పాల్గొన్నారు.

పెన్షన్ సంఘం కార్యాలయంలో..

ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పెన్షన్ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రపండా అధ్యక్షతన రండీ టీ తాగుతూ మాట్లాడుకుందాం, ఏపీజీఈఏ ఆవిర్భావ దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆ సంఘం జెండాను ఎగురవేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా యూపీ హైకోర్టు అడిషనల్ రిజిష్టర్ విద్యాసాగర్ హాజరయ్యారు. గవర్నమెంట్ పెన్షన్ వెల్ఫేర్ సంఘం అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ డ్రెస్‌ల పంపిణీ

రాజాం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త, అడెప్ట్ చిప్స్ వ్యవస్థాపకుడు లోలుగు మదన్ తన తల్లి పేరిట స్థాపించిన శ్రీమతి లోలుగు సుశీల మెమోరియల్ ఫౌండేషన్ ద్వారా స్థానిక కేర్ హాస్పిటల్ గ్రౌండ్స్ వద్ద నిర్వహిస్తున్న ఉచిత సైనిక శిక్షణ శిబిరంలో 100 మంది విద్యార్థులకు శనివారం స్పోర్ట్స్ డ్రెస్‌లు పంపిణీ చేశారు. రూరల్ సీఐ హనుమంతు ఉపేంద్ర, ప్రముఖ మత్తుమందు వైద్యుడు సాయంతుల కిరణ్ టంకాల బుచ్చిన్నాయుడు చేతులమీదగా వీటిని అందజేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఇటీవల వెలువడిన కానిస్టేబుల్ ఫలితాల్లో ఫౌండేషన్ ద్వారా శిక్షణ పొందిన పది మంది కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు శ్యామలరావు, లక్ష్మణరావు, రాంబాబు, కోఆర్డినేటర్ వంజరాపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసమని ఇచ్చి.. మూలకు చేర్చి

(ఐదో పేజీ తరువాయి)

పన్నీరు చందమైంది. జిల్లాలో మొత్తం 520 కియోస్క్ యంత్రాలూ దాదాపు మూలనపడ్డాయి. ఒక్కటంటే ఒక్కటి కూడా వినియోగంలో లేదంటే అతిశయోక్తికాదు. ఆశయం సంగతి ఎలా ఉన్నా అమలులో మాత్రం అట్టర్ ప్లాప్ అయింది. ఈ ప్రభుత్వం వాటిని వినియోగంలోకి తీసుకురాదలిస్తే ముందు రైతులకు కియోస్క్ నిర్వహణపై అవగాహన కల్పించాలి. రైతు సేవా కేంద్రాలుగా మారిన ఆర్బీకేలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలి.

పోలీసులకు ఊరటెప్పుడో?

(ఐదో పేజీ తరువాయి)

సరెండర్ లీవ్ కింద చెల్లించాల్సిన డబ్బులు అందలేదు. ఒక్కో ఉద్యోగికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల సొమ్ము ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది.

వారాంతపు సెలవు ఊసేలేదు

అధికారంలోకి వస్తే పోలీసు సిబ్బందికి వారాంతపు సెలవు ఇస్తామని ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఏడాది గడిచినా ఇప్పటికీ ప్రభుత్వం నోరు మెదపలేదు. వీక్లీ ఆఫ్ లేకపోవడంతో పోలీసులకు విశ్రాంతి కరువవుతోంది. పోలీసులు లేకుండా అడుగు బయట పెట్టలేని నాయకులు వారి బాగోగుల గురించి పట్టించుకోవడం లేదు. జిల్లాలో 62 పోలీసు స్టేషన్ల పరిధిలో దాదాపు 2,200 మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వారంతా ప్రభుత్వ స్పందన కోసం, తమ సంక్షేమంపై సానుకూల నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు.

గౌతు లచ్చన్న ఆదర్శనీయుడు

(ఐదో పేజీ తరువాయి)

చేస్తున్నామన్నారు. బడుగు, బలహీనవర్గాలకు ఆయన దిక్సూచి లాంటివారన్నారు. ఉత్తరాంధ్రకు గౌతు లచ్చన్న అందించిన సేవలకు కృతజ్ఞతగా చంద్రబాబునాయుడు తోటపల్లి ప్రాజెక్టుకు లచ్చన్న పేరును నామకరణం చేశారని గుర్తుచేశారు. కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ, గౌతు లచ్చన్న గొప్ప సామాజిక కార్యకర్తని, ఆయన గొప్పతనం భావితరాలకు తెలియజేసేందుకు ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామన్నారు. మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు మాట్లాడుతూ, గౌతు లచ్చన్న ఉద్యమాలకు నిప్పుకణిక అని, ఆయన జీవితం ఉద్యమాలతో సాగిందన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపుకార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్విని, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి, డీఈఓ మాణిక్యంనాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య, బీసీ సంక్షేమ శాఖాధికారి జ్యోతిశ్రీ, ఉపకులాల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ ఆదినారాయణ, రజక సంఘం రాష్ట్ర నాయకురాలు విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

'ఆశ'లు వెల్లివిరిసేలా..

(ఐదో పేజీ తరువాయి)

ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ వెసులుబాటును రెండు డెలివరీలకే పరిమితం చేసింది. ఈ ఏడాది మార్చిలో చలో విజయవాడ కార్యక్రమంలో ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు ఆశ వర్కర్ల ఉద్యోగ విరమణ కాలాన్ని 62 ఏళ్లుగా నిర్ణయించారు. అయితే ఈ హామీపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. ఇప్పటివరకూ ఆశవర్కర్లకు గౌరవ వేతనంగా రూ.10 వేలు ఇస్తున్నారు. ఈమొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.7200, కేంద్ర ప్రభుత్వం రూ.2800 సమకూరుస్తోంది. ఇదిలా ఉంటే ఆశవర్కర్ ఉద్యోగ విరమణ తరువాత ఆర్థిక భద్రత కోసం గౌరవవేతనంలో సగం రూ.5వేలు వంతున గరిష్ఠంగా రూ.1.50 లక్షలు గ్రాట్యుటీగా చెల్లించాలని ప్రభుత్వం ప్రకటించింది. కాగా గ్రాట్యుటీ చెల్లింపునకు సంబంధించి కనీస కాలాన్ని ప్రామాణికంగా నిర్ణయిస్తారా, అందరికీ వర్తింపజేస్తారా అనేది ప్రభుత్వం ప్రకటించాల్సి ఉంది. గ్రాట్యుటీ చెల్లింపు విషయానికొస్తే దేశంలో కొన్ని రాష్ట్రాలు మాత్రమే ఆశవర్కర్లకు చెల్లిస్తున్నాయి. ప్రభుత్వ తాజా ప్రకటనతో మన రాష్ట్రం కూడా ఆయా రాష్ట్రాల సరసన చేరబోతోంది.

ఎలా ముందుకెళ్లాలి?

(ఐదో పేజీ తరువాయి)

సమయంలో నష్టపరిహారం, ఉద్యోగాలు, షేర్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన వంటి అనేక హామీలను జిందాల్ యాజమాన్యం ఇచ్చింది. అవేవీ నెరవేర్చకపోవడంతో నిర్వాసిత రైతులు అప్పుడప్పుడు భూముల్లోకి రావడం, వివిధ రూపాల్లో రోడ్డెక్కడం చేసేవారు. స్థానిక నాయకులు వారిలో కోపం చల్లారేలా మాట్లాడి మమ అనిపించేవారు.

● గత వైసీపీ ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పరిశ్రమల నిర్మాణానికి జిందాల్ యాజమాన్యం భూములు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చింది. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించే ఉద్దేశంతో ఈ ప్రభుత్వం ఒప్పందం కొనసాగించేందుకు సిద్ధపడింది. ఆ క్రమంలో జిందాల్ యాజమాన్యం ఆ భూముల్లోని చెట్లు, పొదలు తొలగించేపనికి పూనుకుంది. ఇదే సమయంలో సాగులో వున్న పంట, ఇళ్ల తొలగింపుకు సిద్ధపడుతుండడంతో తమకు తెలియకుండా ఆ భూములను జిందాల్ యాజమాన్యం రిజిస్ట్రేషన్ చేసేసుకుందని ఇళ్ల యజమానులు, సాగుదారులు గగ్గోలు పెడుతున్నారు. గ్రీవెన్స్‌లో వినతులు అందిస్తున్నారు.

● ఇప్పటికే జిందాల్‌కు ఇచ్చిన భూములు భూ సేకరణ చట్టం కింద జరగలేదని, 2013 భూ సేకరణ చట్ట ప్రకారం తిరిగి రైతులకు భూములు దక్కుతాయని వారంతా భావిస్తున్నారు. నాలుగు ఏళ్లలో పరిశ్రమను నిర్మించడంతో పాటు ఉద్యోగాలు, షేర్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని నాడు చెప్పిన యాజమాన్యం మాట తప్పడంతో తమ భూములను తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నష్టపరిహారంలో అన్యాయం జరిగిందని కలెక్టరేట్ గుమ్మం తొక్కుతున్నారు. విచారణ ప్రత్యేక అధికారిగా కెఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ మురళీను నియమించారు. ఎప్పుడో 15 ఏళ్ల క్రితం అప్పగించిన జిందాల్ భూముల సమస్యలకు పరిష్కారం చూపేందుకు ఇప్పుడు అధికారులు కష్టించాల్సి వస్తోంది.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. శనివారం గుమ్మలక్ష్మీపురంలోని క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పలువురు సమస్యలపై వినతిపత్రాలు అందించారు. సమస్యలు త్వరగా పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకులు పాల్గొన్నారు.

భావితరాలకు గౌతు లచ్చన్న స్ఫూర్తి

పార్వతీపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న స్ఫూర్తిదాయకమని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు.శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న 116 జయంత్యుత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చన్న చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులఅర్పించారు. అనంతరం విజయచంద్ర మాట్లాడుతూ లచ్చన్న దూరదృష్టి, దృఢమైన గాంధేయవాదంతో అంటరానితనం, సామాజిక వివక్షకు వ్యతిరకంగా పోరాడారన్నారు. హరిజన సేవాసంఘాన్ని స్థాపించి వారి కోసం రాత్రి పాఠశాలలు ప్రారంభించారని, బలహీనవర్గాల అభ్యున్నతికోసం పనిచేశారని తెలిపారు.

వరదల సమయంలో కాజ్‌వే దాటొద్దు

మక్కువరూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగ్గేరు సమీపంలో అడారిగెడ్డ కాజ్‌వేను వరదల సమయంలో గిరిజనులు తొందరపడి దాటొద్దని డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణ కోరారు. ఇక్కడ కాజ్‌వేను శుక్రవారం దాటుతుండగా ద్విచక్రవాహనంతో ఇద్దరు వ్యక్తులు గెడ్డలో పడి కొట్టుకుపోయి బయటపడిన విషయం విదితమే. ఈనేపథ్యంలో శనివారం ఘటనా స్థలాన్ని సూర్యనారాయణతోపాటు పనసభద్ర వీఆర్వో రామకృష్ణ, గ్రామకార్యదర్శి బి.పోలినాయుడు, సీదరపు రామారావు పరిశీలించారు. దుగ్గేరు ఏజెన్సీ ప్రాంతంలోని పొయ్యిమల గ్రామానికి చెందిన చోడిపిల్లి చంద్ర, ఆయన బంధువు కలిసి శుక్రవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై అడారిగెడ్డపై ఉన్న కాజ్‌వేను దాటివెళ్తుండగా హఠాత్తుగా వరద ఉధృతి పెరిగింది. దీంతో వారిద్దరూ జారిగెడ్డలో పడి కొట్టుకు పోతుండగా గుంటభద్ర గ్రామానికి చెందిన కొందరు వారిని రక్షించారు. ఈవిషయంపై శనివారం పత్రికల్లో ప్రచురితంకావడంతో అడారిగెడ్డ కాజ్‌వేను పరిశీలించారు.



అలజంగి వద్ద వేగావతి నదిలో శిథిలావస్థలో ఉన్న ఊటబావి

గోడలు బీటలువారి.. పైపులు తుప్పుపట్టి

● వేగావతి నదిలో శిథిలావస్థకు చేరిన ఊటబావి

బొబ్బిలి రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలజంగి వద్ద వేగావతి నదిలో ఉన్న ఊటబావి నిర్వహణ లోపం వల్ల పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో గోడలు బీటలు వారాయి.పైపులకు తుప్పుపట్టాయి. దీంతో ఊట బావిలో నీరు ఉండేందుకు అవకాశం లేకుండాపోయింది. లీకులు ద్వారా బయటకు వస్తోంది. అలజంగి, పెంట, వెలగవలస, రంగరాయపురం,శివడవలస, కొత్తపెంట తదితర గ్రామాల్లో పదివేల మందికి నీరందించేందుకు నదిలో ఊటబావిని రెండు దశాబ్దాల కిందట ఏర్పాటుచేశారు. అయితే ఐదేళ్ల కిందట శిథిలావస్థకు చేరినా అధికారులు పరిశీలించి, ప్రతిపాదనలు చేస్తున్నా కనీస మరమ్మతులకు నోచుకోవడంలేదు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాలకు ఇక్కడి నుంచి పూర్తిస్థాయిలో తాగునీరందడం లేదు. కాగా అలజంగి వద్ద వేగావతి నదిలో ఉన్న ఊటబావిని ఇటీవల పరిశీలించామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ డిల్లీశ్వర రావు తెలిపారు. ఊటబావితో పాటు పైపులు కూడా మార్చడానికి 50 లక్షల రూపాయలతో ప్రతిపాదనలు పంపించామని చెప్పారు.

మన్యం జిల్లాలో విలీనం చేయాలి

● బొబ్బిలిలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

బొబ్బిలి ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) బొబ్బిలి అసెంబ్లీ నియోకవర్గాన్ని పార్వతీపురం మన్యంజిల్లాలో విలీనం చేయాలని పలు పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం బొబ్బిలిలోని జెండావీధిలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సీపీఐ, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, రైతు సంఘం, ఏఐటీయూసీ నాయకులు తీర్మానించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మన్యం జిల్లాలో బొబ్బిలిని కలపడం వల్ల భౌగోళికంగా, ఆర్థికంగా అనేక ఉపయోగాలున్నాయని తెలిపారు. కొత్తజిల్లాలో ఏజెన్సీ ప్రాంతం ఉండడంతో కేంద్రం నుంచి నిధులు పుష్కలంగా వచ్చే అవకాశముందని, దీంతో వెనుకబడిన ప్రాంతం మరింత అభివృద్ధిచెందుతుందని చెప్పారు.గతంలో పార్వతీపురం రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న సమయంలో బొబ్బిలి ఆ పరిధిలోనే ఉండేదని, దీంతో అక్కడ అధికారులు, ఆ ప్రాంతంతో అవినాభావ సంబంధాలు బలీయంగా ఉన్నాయని తెలిపారు. బొబ్బిలి నుంచి కేవలం 20 కిలోమీటర్ల దూరం ఉండడంతో రెవెన్యూ, న్యాయశాఖ పనులు సత్వరం పరిష్కారమయ్యేందుకు మార్గంసుగమమవుతుందని చెప్పారు.ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాని సమావేశంలో నాయకులు కోరారు. సమావేశంలో సీపీఐ నాయకులు ఒమ్మి రమణ, కండాపు ప్రసాదరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మరిశర్ల రామారావునాయుడు, కాంగ్రెస్ ఇన్‌చార్జి మువ్వల శ్రీనివాసరావు, ఇతర సంఘాల నాయకుడు పిల్లా లక్ష్మణరావు, వేమిరెడ్డి లక్ష్మునాయుడు, శ్రావణ్‌కుమార్, కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్, గొల్లపల్లి తౌడు, కొలుసు వెంకటసత్యనారాయణ, పాలూరు కృష్ణ పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మునిసిపాలిటీ 21వ వార్డు ఉప ఎన్నికకు కసరత్తు

బొబ్బిలి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి మునిసిపాలిటీ పరిధిలోని 21వ వార్డు కౌన్సిలరు పదవికి ఉప ఎన్నిక నిర్వహణకు కసరత్తు ప్రారంభమైంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అమరావతిలో ఇటీవల రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో కమిషనరు లాలం రామలక్ష్మి, టౌన్‌ప్లానింగ్ అధికారి పిలిప్ పాల్గొన్నారు.ఈనెల20లోగా వార్డు పరిధిలోని ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదలచేయాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో అధికారులు తలమునకలయ్యారు. కాగా కౌన్సిలరుగా వైసీపీ నుంచి మరిశర్ల రామారావునాయుడు ఎన్నికయ్యారు. ఆయన అప్పట్లో మునిసిపల్‌ఛైర్మన్ పదవిని ఆశించారు. వైసీపీ అధినాయకులు గొల్లపల్లికి చెందిన సావు వెంకటమురళీకృష్ణారావుకు అవకాశంకల్పించారు. ఈనేపథ్యంలో వైసీపీ నాయకులతో విభేదించిన మరిశర్ల తనకు సముచితస్థానం దక్కలేదని భావించి కౌన్సిలరు పదవికి, వైసీపీకి రాజీనామా చేశారు. ఆయన వెంటనే బీజేపీలో చేరి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. దీంతో 21వ వార్డు కౌన్సిలరు స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమయ్యింది. వైసీపీకి మరిశర్ల రాజీనామా చేసిన తర్వాత వార్డు వైసీపీ ఇన్‌చార్జి బాధ్యతలను చంద్రపుడి రమేష్ నిర్వహిస్తున్నారు.



బొబ్బిలిరూరల్: పారాది అంగన్‌వాడీ కేంద్రం-3లో కృష్ణుడు, రాధ వేషధారణలో చిన్నారులు



బొబ్బిలి: స్వామి వారి వీధి అంగన్‌వాడీ కేంద్రంలో...

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

బొబ్బిలి/ రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సీడీపీవో జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ చిన్నతనం నుంచే పండుగలు, సంస్కృతి, సంప్రదాయాల పట్ల మక్కువ పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.చిన్నారులు కృష్ణుడు,గోపికల వేషధారణలు అలరించాయి. బొబ్బిలిలోని పూల్‌బాగ్ గీతామండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ వేషధారణల పోటీలు నిర్వహించారు. మహిళల, చిన్నారుల కోలాటం ఆడారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని సందడిగా నిర్వహించారు.

●రామభద్రపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరికతోట తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. పాతరేగలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో యువకులు సందడిగా ఉట్టికొట్టారు.

వాటర్ ట్యాంక్ నిరుపయోగం



మూలకుచేరిన వాటర్ ట్యాంక్

బొబ్బిలి రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటుచేసిన హ్యాండ్‌వాష్ వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా మారింది. ఆరోగ్యకేంద్రానికి చికిత్సకోసం వచ్చిన వారు చేతులు, కాళ్లు శుభ్రం చేసుకోవడానికి దీన్ని ఏర్పాటుచేశారు. కొద్దిరోజులు పనిచేసింది. తర్వాత పాడవడంతో మరమ్మతులకు నోచుకోకపోవడంతో వినియోగంలో లేకుండాపోయింది. కాగా త్వరలో మరమ్మతులు చేయిస్తామని పిరిడి పీహెచ్‌సీ వైద్యాధికారి భరద్వాజ్ తెలిపారు.

కృపావలసలో సీజనల్ వ్యాధులపై సర్వే



కృపావలసలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బొబ్బిలి రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధిలోగల కృపావలస గ్రామంలో పిరిడి వైద్యాధికారి రఘువంశి సూచనల మేరకు శనివారం సీజనల్ వ్యాధులపై ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేడినీళ్లు, వేడి ఆహారం తీసుకోవాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని గిరిజనులకు సూచించారు. సచివాలయ కేంద్రంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ప్రథమ వైద్యం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ తవిటినాయుడు, శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి వాసిరెడ్డికి నివాళి

బొబ్బిలి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి రైల్వేసెంటరులో మాజీ మంత్రి వాసిరెడ్డి కృష్ణమూర్తినాయుడు జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి శనివారం మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు, కొప్పలవెలమ సేవాసంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టరు కర్రి సత్యనారాయణ, గొట్టాపు కృష్ణమూర్తి, ఎల్.జగన్నాథం, కేసీహెచ్ అప్పలస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రెడ్డి కృష్ణమూర్తి,బలగ సాయికృష్ణ వాలేటి తవిటినాయుడు, మరడ అప్పారావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల విజేత గరివిడి

కొత్తవలస, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అప్పన్నపాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్‌పోటీల్లో జిల్లాకు చెందిన గరివిడి గ్రూపు సభ్యులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఉత్తరాంధ్ర క్విజ్ మాస్టర్ కర్రి రాము ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి 15 గ్రూపులు పాల్గొన్నాయని తెలిపారు. ఈ పోటీలలో రెండో స్థానాన్ని గుర్ల గ్రూపు, మూడో స్థానాన్ని విశాఖపట్టణం మద్దిలపాలెం గ్రూపు, నాలుగో స్థానం విజయనగరం సింధూ రీడింగ్‌రూం గ్రూపు, 5వ స్థానాన్ని అక్కిరెడ్డిపాలెం గ్రూపు సాధించాయని వివరించారు. విజేతలకు వరుసగా రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేలు, వేయి రూపాయల చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందించామని చెప్పారు. ప్రత్యేక బహుమతి కింద రూ.1,500 అందించామన్నారు. బహుమతులకు టీడీపీ నాయకుడు తిక్కాన చినదేముడు ఆర్థిక సాయం అందించారని తెలిపారు.

ఖాళీ ప్లేట్లతో జిందాల్ నిర్వాసితుల నిరసన



ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గత 56 రోజులుగా జిందాల్ నిర్వాసితులు తమ డిమాండ్ల సాధనకు బొడ్డవర వద్ద నిరసన చేపడుతున్నారు. దీనిలో భాగంగా శనివారం ఖాళీ పేట్లుతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా జిల్లా రైతు సంఘ ఉపాధ్యక్షుడు చల్లా జగన్ మాట్లాడారు. గత కొద్ది రోజులుగా వందలాది మంది నిర్వాసితులు శాంతియుతంగా నిరసన చేస్తున్నా అధికారులకు, ప్రభుత్వానికి కనికరం లేదన్నారు.

గుంత పూడ్చివేత

జామి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమసింగి ఫ్లైఓవర్‌పై ఏర్పడిన పెద్ద గుంత కారణంగా నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారలెవరూ దీనిని పట్టించుకోవడం లేదు. దీంతో స్థానిక టీడీపీ నాయకుడు దనియాల పైడిరాజు స్పందించారు. గ్రామ యువత సహకారంతో శనివారం ఆ గుంతను పూర్తిస్థాయిలో కప్పించారు. వాహనదారులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.



భీమసింగి ఫ్లైఓవర్‌పై గుంతను కప్పిస్తున్న దృశ్యం

వసతిగృహం తనిఖీ

మెరకముడిదాం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): గర్భాం ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నపూర్ణమ్మ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహంలో మెనూ అమలు తీరును పరిశీలించి, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. వసతి గృహంలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. వసతి గృహంలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. మెనూ ప్రకారంగా విద్యార్థులకు నాణ్యమైన ఆహారం పెట్టడంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానికంగా ఉంటూ విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్న వార్డెన్ వెంకటరావును ఆమె అభినందించారు.

భక్తుల కోసం పనిచేయండి: మంత్రి

సాలూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): భక్తుల సేవ కోసం సమష్టిగా పని చేయాలని గిరిజనశాఖ మంత్రి సంధ్యారాణి కోరారు. శనివారం సాలూరులోని వెంకటేశ్వర దేవస్థానం కమిటీ ఛైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సంధ్యారాణి కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. దేవస్థానం అభివృద్ధి కోసం పారదర్శకతతో ముందుకుసాగాలని పాలకమండలని కోరారు.